



రాష్ట్ర మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న ఎంఏ.గఫూర్ ,ఇతర నాయకులు

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలేవి

- పట్టించుకోని ఎన్‌హెచ్ 40 అధికారులు - సర్వీస్ రోడ్డు లేకపోవడంతోనే

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

నిత్యం రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నప్పటికీ అక్కడ నివారణ చర్యలు తీసుకోవడంలో మాత్రం జాతీయ రహదారి విస్తరణ అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డు ప్రమాదంలో అనేకమంది మృత్యువాత పడుతున్నారు. రహదారికి అనుకోని సర్వీస్ రోడ్డు వెంటనే వేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఓర్వకల్ మండల కేంద్రం సమీపం గుండా ఎన్ హెచ్ 40 హైవే వెళుతుంది. ఈ హైవే పక్కన ఉన్న తహశీల్దార్, పోలీసు, ఎంపిడిఒ కార్యాలయాలతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, మోడల్ స్కూల్ కూడా ఉంది. ఈ కార్యాలయాలకు నిత్యం అనేక మంది ప్రజలు తమ పనుల నిమిత్తం వచ్చి వెళ్తుంటారు. మోడల్ స్కూల్‌కు విద్యార్థులు. చుట్టుపక్కల గ్రామాల నుండి వస్తుంటారు. ఇటీవల కాలంలో ఈ జాతీయ రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. గత కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో విద్యార్థులు మృతి చెందారు. ఓర్వకల్ పోలీస్ స్టేషన్లో పనిచేసే కానిస్టేబుల్ కూడా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. కర్నూలు నుండి నేరుగా వచ్చే వాహనాలు ఓర్వకల్లు మండల కేంద్రంలోకి వెళ్లేందుకు సర్వీస్ రోడ్డు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై వెళ్లాలంటేనే ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సిన పరిస్థితి ఉంది. గత రెండు రోజుల క్రితం ఓర్వకల్ కు చెందిన రైతు కృష్ణ పొలం పనుల నిమిత్తం ఎద్దుల బండి పై వెళ్తుండగా ప్రమాదం చోటు చేసుకుంది. వెంటనే రైతు చాకచక్యంతో ఎద్దుల బండిపై నుంచి దూకి తన ప్రాణాలను కాపాడుకున్నారు. ఇలాంటి ఘటనలు అనేకం జరుగుతున్నప్పటికీ అధికారులు మాత్రం ఇక్కడ ఇరువైపులా సర్వీస్ రోడ్డు వేయకుండా వదిలేశారు. జిల్లాస్థాయి రోడ్డు భద్రత కమిటీలో ఎన్ హెచ్ 40 రహదారిపై అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు చర్చించుకుంటున్నారు. కానీ ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవడంలో వైఫల్యం చెందుతున్నారు.



రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి



- బి.నాగన్న, సిపిఎం ఓర్వకల్ మండల కార్యదర్శి

ఓర్వకల్లు మీదుగా వస్తున్న జాతీయ రహదారి ఇరువైపులా వెంటనే సర్వీస్ రోడ్డు వేయాలి. ఇప్పటికే అనేక రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, నియంత్రించాలని అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికైనా రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి.

ఈ రహదారిపై వెళ్లాలంటేనే భయమేస్తుంది



- కృష్ణవేణి, స్థానికురాలు

ఈ జాతీయ రహదారి గుండా వెళ్లి రావాలంటేనే భయపడాల్సి వస్తుంది. ఇక్కడే జాతీయ రహదారి పక్కనే ఉన్న కాలనీలో నివాసం ఉంటున్నాం. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

సర్వీస్ రోడ్డు వేస్తే తప్ప ప్రమాదాలు జరగవు



- శ్రీరాములు, స్థానికుడు

జాతీయ రహదారిపై రోజురోజుకు ప్రమాదాలు తిరుగుతున్నాయి.తగ్గడం లేదు. ఈ ప్రమాదాల నియంత్రణకు గాను వెంటనే సర్వీస్ రోడ్డు వేస్తే తప్ప భవిష్యత్తులో ఎలాంటి ప్రమాదాలు జరగవు

విశాఖ ఉక్కు ప్రయివేటీకరణ ఆపాలి

- ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం
- కేంద్ర కార్మిక సంఘాలు, రైతుల సంఘాల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశాఖ ఉక్కు ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలని, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీకి ప్రభుత్వమే సొంత గనులు కేటాయించాలని, విశాఖపట్నం ప్రైవేటీకరణ ఆపాలని కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు తలపెట్టిన రాష్ట్రవ్యాప్త రస్తారోకో కార్యక్రమంలో భాగంగా కర్నూలు నగరం రాజ్ విహార్ సెంటర్లో పెద్ద ఎత్తున ఎఐటియుసి, సిఐటియు, ఎఐకెఎస్, ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఎఐటియుసి నగర కార్యదర్శి జి చంద్రశేఖర్, సిఐటియు ఓల్డ్ సిటీ కార్యదర్శి విజయ్, న్యూ సిటీ కార్యదర్శి సాయి బాబా అధ్యక్షత వహించారు. ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.మునెప్ప సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి డి శ్రీనివాసులు మాట్లాడారు. ఎస్.మునెప్ప మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో జరిగిన పోరాటంలో 32 మంది అమరవీరుల బలిదానంతో ఏర్పాటైన విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటు పరం చేయకూడదని మూడేళ్లుగా ఉద్యమం నడుస్తున్న ప్రధానమంత్రి నరేంద్ర మోడీ విశాఖ ఉక్కును ప్రవేట్ పరం చేయడానికి ఆదానికి అప్పజెప్పడానికి ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా తెలంగాణకు వచ్చిన మోడీ సింగరేణి గనులను ప్రైవేటుపరం చేయడం లేదని చెప్పారన్నారు. విశాఖ ఉక్కును మాత్రం ఎందుకు ప్రైవేట్ పరం చేస్తున్నారని, ఆంధ్రప్రదేశ్ కు ఎందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ద్రోహం చేస్తున్నాడని ప్రశ్నించారు. ఎన్‌డిఎ భాగసామిగా ఉన్న టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అమరావతి గురించి, పోలవరం ప్రాజెక్టు గురించి మాట్లాడుతున్నాడు తప్ప ఎందుకు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను ఆపడం లేదని అన్నారు. తక్షణమే చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి విశాఖ ఉక్కు ప్రైవేటుపరం కాకుండా ఆపాలన్నారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడుతూ ఉద్దేశపూర్వకంగా కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కును నష్టాల్లోకి దింపిందని, ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విశాఖపట్నం నేడు 45 లక్షల టన్నులకు దిగజార్చారన్నారు. నష్టాలు పేరుతో విశాఖ ఉక్కును ప్రవేట్ పరం చేయాలని చూస్తున్నారని విమర్శించారు. కేంద్ర పరిశ్రమల శాఖ మంత్రి కుమారస్వామి విశాఖ ఉక్కును పరిశీలించి అతి నాణ్యత కలిగిన విశాఖ ఒకటని ప్రశంసించి విశాఖ ఉక్కు ప్రైవేటుకరణ ఆపుతామని ఇప్పుడు విశాఖ ఉక్కు ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులకు వాలంటరీ రిటైర్మెంట్స్ రూ.90 కోట్లు కేటాయించి 2500 మంది కార్మికులను నాగపూర్‌కు తరలించాలని అన్నారు. 19,000 మంది పనిచేస్తున్న విశాఖ ఉక్కులో నేడు 12,000 మంది మాత్రమే పనిచేస్తున్నారని అన్నారు. గతంలో రోజుకి 21 టన్నులు దిగుబడి ఉండేది నేడు ఆరు టన్నులకు తగ్గిపోయిందని తెలిపారు. విశాఖ ఉక్కు అవసరమైన విద్యుత్తును గతంలో స్టీల్ ప్లాంట్ లోనే ఉత్పత్తి అయ్యేదని నేడు బయట నుండి కొనుగోలు చేయడం వల్ల రూ.45 వేల కోట్లు చెల్లించవలసి వస్తుందని అన్నారు. ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని కాపాడేటువంటి విశాఖ ఉక్కు ప్రైవేటేకరణ ఆపేంతవరకు కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు పోరాటం కొనసాగిస్తాయని అన్నారు. ఏపీ రైతు సంఘంనుంచి డి శ్రీనివాసరావు మాట్లాడారు. సిఐటియు నగర నాయకులు రాముడు, సిఐటియు ఓల్డ్ సిటీ అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, న్యూ సిటీ అధ్యక్షులు నరసింహులు, అటో వర్కర్ సీనియర్ జిల్లా కార్యదర్శి ప్రభాకర్, మహమూద్, సివిల్ సప్లయ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కృష్ణ, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుధాకరప్ప, యేసు, ఎఐటియుసి నగర నాయకులు బి.వెంకటేష్, టి.రామాంజనేయులు కిట్టు, నల్లన్న, పురుషోత్తం రేణుక రైతు సంఘం నాయకులు సురేంద్ర మహమ్మద్ నాయకత్వం వహించారు.



రాస్తారోకో నిర్వహిస్తున్న సిఐటియు, ఎఐటియుసి నాయకులు

వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలి

- రాష్ట్ర మంత్రి ఎన్ఎండి.ఫరూక్‌కు ఆవాజ్ వినతి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్‌ను మంగళవారం కర్నూలు స్టేట్ గెస్ట్ హౌస్ లో ఆవాజ్ కమిటీ వ్యవస్థాపకులు మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ ఆధ్వర్యంలో వినతి పత్రాన్ని అందజేశారు. కేంద్రంలో మూడవసారి అధికారంలో కి వచ్చిన బిజెపి నరేంద్రమోడీ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్‌చట్ట సవరణ ద్వారా ముస్లిం మైనార్టీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందని తెలిపారు. ముస్లిం మైనార్టీలపై అనేక రూపాలలో ఎన్‌డిఎ ప్రభుత్వం దాడులు కొనసాగిస్తుందని, అందులో భాగంగా పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం వక్ఫ్‌చట్టాన్ని సవరిస్తూ 40 ప్రతిపాదనలను ప్రవేశపెట్టిందన్నారు. ఈ చట్ట సవరణ చాలా దుర్మార్గమైనదని, దేశవ్యాప్తంగా 9,40,000 ఎకరాల భూములు కలిగిన మూడవ అతిపెద్ద సంస్థ వక్ఫ్ బోర్డ్ ఉన్నదన్నారు. ముస్లిం మైనార్టీల భాష, సాంస్కృతిక, ఆర్థిక, విద్య ,ఉపాధి సామాజిక అభివృద్ధి భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ధార్మిక కార్యక్రమాల కోసం దూర దృష్టితో పూర్వీకులు తమ ఆస్తులను, భూములను వక్ఫ్ చేశారన్నారు. ఈ భూములను రక్షించి మైనార్టీలను అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని ఉద్దేశంతో వక్ఫ్‌బోర్డు చేశారన్నారు. ఏ ఉద్దేశంతో ఈ బోర్డు ఉందో ఆ ఉద్దేశాన్ని నిర్వర్తించడంలో ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగానే విస్మరించాయన్నారు. వక్ఫ్‌ఆస్తులను కాపాడవలసిన వారే అక్రమాలకు, కబ్జాలకు పాల్పడుతున్నారు. బిల్లు సవరణ పేరుతో అన్యమతస్తులను వక్ఫ్ బోర్డులో పెట్టడం వల్ల వక్ఫ్ లక్ష్యాలను విస్మరించడమే అవుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ముస్లింలు అభివృద్ధి పట్ల గాని, వక్ఫ్ ఆస్తుల రక్షణ పట్ల గాని చిత్తశుద్ధి ఉంటే రంగనాథ మిశ్రా సిఫారసులను, సచార్ కమిటీ నివేదికలను తెప్పించుకొని ముస్లింల అభివద్ధికి చేసిన సూచనలు ఎందుకు అమలు చేయడం లేదన్నారు. వక్ఫ్ చట్ట సవరణ ద్వారా ముస్లిం మైనార్టీలకు వక్ఫ్ ఆస్తులపై ఎలాంటి హక్కులు లేకుండా చేస్తుందన్నారు. దర్గాలు, మసీదులు, పీర్ల చావడి తదితర వాటిపై వారసులకు నిర్వహణ కమిటీలకు ఎలాంటి హక్కులు లేకుండా వారి నుండి ఆస్తులను లాగేసుకోవడం కోసం చేస్తున్న చట్టం తప్ప మరొకటి కాదన్నారు. ఈ బిల్లు పార్లమెంటులో జాయింట్ యాక్షన్ పార్లమెంటరీ జెపిసికి ఇచ్చారని, తమ ప్రభుత్వం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వక్ఫ్ చట్ట సవరణ పై ఒత్తిడి తీసుకొని వచ్చి వక్ఫ్ చట్ట సవరణను రద్దు చేయాలని తమరి ద్వారా విన్నవిస్తున్నామన్నారు. ఆవాజ్ కమిటీ వ్యవస్థాపకులు ఎంఏ గఫూర్‌తోపాటు ఆవాజ్ నగర అధ్యక్షులు,పి.ఇక్బాల్ హుస్సేన్, ఉపాధ్యక్షులు నాసిర్ అహ్మద్ ,ఆవాజ్ నగర కార్యదర్శి షేక్ మొహమ్మద్ షరీఫ్ ,న్యూ సిటీ కార్యదర్శి షేక్ మొహమ్మద్‌రఫీ, నగర సహాయ కార్యదర్శి చోటుభాయ్ పాల్గొన్నారు.

జిల్లా వార్షిక రుణ ప్రణాళికకు ఆమోదం

- మొత్తం రూ.15068.46 కోట్లు రుణాలు
- వ్యవసాయ రంగానికి రూ.7746.84 కోట్లు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లా వార్షిక రుణ ప్రణాళికకు ఆమోదం తెలుపుతూ జిల్లాస్థాయి బ్యాంకర్ల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ ఏడాది వార్షిక ప్రణాళిక కింద రూ.15,068.46 కోట్లు రుణాలు ఇచ్చేందుకు నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగానికి రూ.7746.84 కోట్లు రుణాలు ఇవ్వనుంది. పంట రుణాలు కింద ఖరీఫ్ రూ.2873.96 కోట్లు, రబీ రూ.1997.16 కోట్లు మొత్తం పంట రుణాలు - రూ.4871.12 కోట్లు ఇవ్వనున్నట్లు తెలిపింది. అగ్రికల్చర్ టర్మ్ లోన్స్ రూ.2318.18 కోట్లు అగ్రికల్చర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ రూ.88.03 కోట్లు వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలు రూ.469.51 కోట్లు మొత్తం వ్యవసాయ రంగం రూ.7746.84 కోట్లు ఇచ్చేందుకు జిల్లా బ్యాంకర్ల స్థాయి కమిటీ నిర్ణయం తీసుకుంది. మైక్రో, స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ రూ.2560.77 కోట్లు, విద్యా రంగం రూ.198.26 కోట్లుహౌసింగ్ రూ.913.99 కోట్లు, సామాజిక మౌలిక సదుపాయాలు రూ.39.65 కోట్లు, పునరుత్పాదక శక్తి రూ.32.01 కోట్లు ఇతర రంగాలకు రూ.636.7 కోట్లు, ప్రాధాన్యతా రంగ రుణాలకు రూ.12128.22 కోట్లు, అప్రాధాన్యతా రంగాలు రూ.2940.24 కోట్లుమొత్తం రుణాలకు రూ.15068.46 కోట్లు ఇవ్వనున్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.రంజిత్‌బాష అధ్యక్షతన వస్తాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024-25 వార్షిక రుణ ప్రణాళికను జిల్లా కలెక్టర్ విడుదల చేశారు. గ్రామంలో బ్యాంకింగ్ డే ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో అవసరాల్లో ఉన్న వారిని గుర్తించి, రుణాల మంజూరుకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బ్యాంకుల ద్వారా పలు ప్రభుత్వ పథకాల నుండి లభించే సబ్సిడీ, రుణాల మంజూరు పూర్తి వివరాలతో గురించి బుక్లెట్ తయారు చేసి గ్రామాల్లో ఉండే ప్రజలకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలనిల్ డిఎంను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, ఎల్‌డిఎం రామచంద్ర రావు, ఆర్‌బిఐ ఎల్‌డిఎం నవీన్ కుమార్, నాబార్డు డిజిఎం ఎం.సుబ్బారెడ్డి, కెనరా బ్యాంకు డిఎం రఘువీర్, ఎస్సీ,ఎస్టీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ రాజమహేంద్రనాథ్, ఇంఛార్జి మున్సిపల్ కమిషనర్ రామలింగేశ్వర్, కెడిసిసి బ్యాంకు సిఇఒ విజయశేఖర్, బ్యాంకర్స్ పాల్గొన్నారు.



ప్రణాళికను విడుదల చేస్తున్న కలెక్టర్, అధికారులు



బాధ్యతలు స్వీకరించిన డిసిసి అధ్యక్షుడు

నెలలోపు పూర్తి కార్యవర్గం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నెలలోగా కొత్త జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గాన్ని ఏర్పాటు చేస్తామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే పి.మురళీకృష్ణ వెల్లడించారు. మంగళవారం స్థానిక డిసిసి కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ నూతన అధ్యక్షుడిగా పి. మురళీకష్ణ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాలు గెలుపొందేలా కృషి చేస్తానన్నారు. గ్రామస్థాయి నుండి జిల్లా స్థాయి వరకు పార్టీ బలోపేతానికి చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ డిసిసి అధ్యక్షుడు కె.బాబురావు, మాజీమంత్రి మారెప్ప, మాజీ ఎమ్మెల్సీ సుధాకర్ బాబు, ఇతర కాంగ్రెస్ నాయకులు మురళీకృష్ణను అభినందించారు. .

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్


సచివాలయ సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని నగరపాలక మేనేజర్ ఎన్.చిన్నరాముడు, ఆర్ఒ జునైద్ హెచ్చరించారు. మంగళవారం మునగాలపాడు 99వ రోజ స్ట్రీట్ 123, 124వ సచివాలయాలను మేనేజర్, ఆర్ఒ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆయా సచివాలయాల్లో ప్రజల నుండి వచ్చిన సమస్యలు, వాటి పరిష్కార స్థితిపై ఆరా తీశారు. అనంతరం సిబ్బంది హాజరు, వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్ఐ జి.ఎం. శ్రీకాంత్, ఇంతియాజ్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎంపీ రూ.10లక్షల విరాళం

చంద్రబాబుకు చెక్కును అందజేసిన నాగరాజు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

విజయవాడలోని వరద బాధితులకు తన వంతు సహాయం చేయడానికి కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు రూ.10 లక్ష విరాళం అందజేశారు. విజయవాడ కలెక్టరేట్‌లో సీ.ఎం చంద్రబాబుకు వరద బాధితుల సహాయార్థం రూ.10 లక్షల చెక్కును అందజేశారు. వరద బాధితులకు అండగా నిలిచిన ఎంపీ నాగరాజును సిఎం అభినందించారు. ప్రతి ఒక్కరు ముందుకు వచ్చి తోచిన సహాయాన్ని అందించాలని ఎంపీ కోరారు.



ఆత్మహత్య సమస్యలకు పరిష్కారం కాదు

కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ , సూపరిన్‌టెన్‌డెండ్ డాక్టర్ సి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సమస్యలు ఉన్నాయని ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదని సమస్యలు ఎప్పటికీ శాశ్వతం కాదని ప్రతి సమస్యకి పరిష్కారం ఉంటుందని అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.చిట్టి నరసమ్మ, హాస్పిటల్ సూపరిన్‌టెన్‌డెంట్ డాక్టర్ సి.ప్రభాకర్ రెడ్డి అన్నారు. మంగళవారం ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం సందర్భంగా మెడికల్ కాలేజీలోని సైకియాట్రి డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో విభాగాధిపతి డాక్టర్ నాగేశ్వరరావు అధ్యక్షతన ఆత్మహత్యల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడికి గురి కాకూడదని, ఒత్తిడికి గురి అయినప్పుడు కొంత సమయం విశ్రాంతి తీసుకోవాలని, ఒత్తిడి నివారణలో సహాయం అందించేందుకు సైకియాట్రి డిపార్టుమెంట్ ఎల్లవేళలా సహకారం అందిస్తుందన్నారు. మానసిక వైద్య విభాగం ప్రొఫెసర్ హెచ్ఒడి డాక్టర్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఒత్తిడిని ఎదుర్కోవడానికి అనేక మార్గాలు ఉన్నాయని, రోజువారి జీవితంలో మెడిటేషన్ యోగ భాగంగా చేసుకోవాలన్నారు. ఈ సదస్సులో కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు ఆత్మహత్యల నివారణకు నాటికలు, రీల్స్ ప్రదర్శించారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.రేణుకా దేవి, కాలేజ్ ఆఫ్ నర్సింగ్ సైకియాట్రి అసిస్టెంట్ ప్రొఫెసర్ హెచ్ఒడి మంజులాదేవి, సైకియాట్రి విభాగపు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ బి.గంగాధర్ నాయక్, డాక్టర్ ఎం.యథిరాజు, డాక్టర్ ఎ. చంద్రశేఖర్ డాక్టర్ సుమంత్, ఎన్ఎస్-ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపూర్ణ, సైకాలజిస్ట్ చంద్రశేఖర్ ఎస్ఆర్లు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కెఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ చిట్టి నరసమ్మ

కమ్యూనిటీ విభాగంలో : సమస్యలు ఏర్పడినప్పుడు మానసిక కారణాల వల్ల ఒత్తిడికి లోనై తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం సమస్యకి పరిష్కారం కాదని కమ్యూనిటీ మెడిసిన్ ప్రొఫెసర్ అండ్ విభాగాధిపతి డాక్టర్ సుధాకుమారి అన్నారు. ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం పురస్కరించుకొని కమ్యూనిటీ విభాగంలో 3వ సెమిస్టర్ విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



జెండా ఊపి వాహనాలను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎస్‌పి

వరద బాధితులకు 10వేల కిట్లు

జెండా ఊపి వాహనాలను ప్రారంభించిన కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : వరద బాధితుల సహాయార్థం 10 వేల నిత్యావసర సరుకుల కిట్లను తీసుకుని విజయవాడకు వాహనాలు బయలుదేరాయని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాష తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ నుండి జిల్లా టిడిపి తరుపున వరద బాధితుల సహాయార్థం రూ.కోటి 50 లక్షల విలువచేసే 10 వేల నిత్యావసర కిట్లను తీసుకుని వెళుతున్న వాహనాలను జిల్లా ఎస్‌పి బిందు మాధవ్‌తో కలిసి కలెక్టర్, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ వరద బాధితుల కోసం దాదాపుగా రూ.కోటి 50 లక్షల విలువ చేసే పదివేల నిత్యవసర సరుకుల కిట్లను వాహనాలలో పెట్టి పంపించామన్నారు. ఒక్కో కిట్టు ఒక కుటుంబానికి పది రోజులకు సరిపడా నిత్యవసర సరుకులు బియ్యం, కందిపప్పు, చక్కెర, ఆయిల్, తదితర సరుకులను పంపించామన్నారు. పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యాం బాబు, టిడిపి జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్రగొర్రెల పెంపకదారుల అధ్యక్షులు నాగేశ్వరరావు,అన్ని నియోజకవర్గాల టిడిపి ఇన్చార్జీలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాలు లేకుండా ఎలా బతకాలి

డిసిఎల్ కార్యాలయం ముందు క్లాప్ డ్రైవర్ల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలో పనిచేసే స్వచ్ఛ ఆంధ్రక్లాప్ డ్రైవర్లకు 9 నెలల జీతాలు ఇవ్వకపోతే ఎలా బతకాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు అన్నారు. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న స్వచ్ఛ ఆంధ్ర క్లాప్ డ్రైవర్ల 9నెలల పెండింగ్ జీతాలు ఇవ్వాలని కోరుతూ సిఐటియు ఓల్డ్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో కర్నూలు కార్మిక శాఖ కార్యాలయం ముందు సిఐటియు నగర క్లాప్ డ్రైవర్ల కార్యదర్శి రఘుశేఖర్ అధ్యక్షతన ధర్నా చేశారు. అంజిబాబు,సిఐటియు ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి మారెళ్ళ విజయ రామాంజనేయులు మాట్లాడుతూ కర్నూలు నగర పరిధిలో పనిచేసే క్లాప్ డ్రైవర్లకు 9 నెలలుగా పెండింగ్లో జీతాలు ఉండటం వలన కార్మికుల కుటుంబాల గడవగా చాలా అవస్థలు పడుతున్నారని తెలిపారు. కర్నూలు నగరంలో ఉండే 52 వార్డులు చెత్త లేని నగరంగా పరిశుభ్రంగా ఉన్నాయంటే క్లాప్ డ్రైవర్ల కష్ట ఫలితమేనని గుర్తు చేశారు, గత వైసిపి ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ పేరుతో ఆటోలకు డ్రైవర్లను రిక్రూట్మెంట్ చేసుకుని అగ్రిమెంట్ ప్రకారం రూ.18500 జీతం, ఇఎస్ఐ, పిఎఫ్, కార్మిక చట్టాల అమలు చేస్తామని చెప్పి బినామీ ఏజెన్సీలతో కార్మికుల కడుపు కొట్టారని విమర్శించారు..కార్మిక శాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చారు.




డిసిఎల్ ఆఫీసు ముందు ధర్నా చేస్తున్న క్లాప్ డ్రైవర్లు

డాక్టర్ అఖ్తర్‌భానుకు విశిష్ట విద్యావేత్త పురస్కారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్



అఖిల భారత ముస్లిం విద్యా సంఘం స్వర్ణోత్సవ వేడుకలలో భాగంగా నేడు హైదరాబాద్ కెఎల్ఎన్ ప్రసాద్ ఆడిటోరియంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన విద్యావేత్తల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా చెందిన డాక్టర్ హెచ్ అఖ్తర్‌భానును 'విశిష్ట విద్యావేత్త పురస్కారం"తో తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మొహమ్మద్ అలీ షబ్బీర్ అహ్మద్ సత్కరించారు. డాక్టర్ అఖ్తర్‌భాను సిల్వర్ జూబ్లీ ప్రభుత్వ కళాశాలలో ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్‌గా, క్లస్టర్ యూనివర్సిటీ డీన్-అడ్మినిస్ట్రేషన్ గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆమెకు యుజీ , పీజీ స్థాయిలో 33 సంవత్సరాల బోధనా , పరిపాలనా అనుభవం ఉంది. ఆమె జాతీయ ,అంతర్జాతీయ సెమినార్లు , సమావేశాలలో 120 పరిశోధనా పత్రాలను సమర్పించారు. 3 జాతీయ సెమినార్లను నిర్వహించారు. రచయితగా , సంపాదకురాలిగా 11 పుస్తకాలు, ప్రముఖ జాతీయ అంతర్జాతీయ పత్రికలలో 45 పరిశోధనా వ్యాసాలు ప్రచురించారు. ఆమె క్రియాశీల పరిశోధకురాలు, సామాజిక కార్యకర్త , విద్యాప్రదాతగా ఖ్యాతి గడించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారంతో పాటు అనేక ప్రతిష్టాత్మక అవార్డులను ఆమె పొందారు. డాక్టర్ హెచ్ అఖ్తర్‌భాను విద్య పట్ల అచంచలమైనఅంకితభావం,బోధన,మార్గదర్శకత్వం,విద్యార్థుల భవిష్యత్తును తీర్చి దిద్దడంలో వారు చూపుతున్న నిబద్ధతకు , విద్యా సంస్థలకు ఆమె చేసిన విశేషమైన కృషికి నిదర్శనం ఈ విశిష్ట విద్యావేత్త జాతీయ పురస్కారం అని క్లస్టర్ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్, రిజిస్ట్రార్ ఆచార్య కట్టా వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ డాక్టర్ వివి.సుబ్రమణ్య కుమార్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బిఆర్ ప్రసాద్ రెడ్డి, కర్నూలు జిల్లా మేధావుల వేదిక వ్యవస్థాపకులు ఆచార్య మన్సూర్ రహ్మాన్ అభినందించారు.



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న ఉల్చాల గ్రామ టిడిపి నాయకులు

తుమ్మల వాగును పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఉల్చాలా గ్రామంలో గత కొంతకాలంగా ప్రమాదకరంగా ఉన్న తుమ్మల వాగు బ్రిడ్జిని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి పరిశీలించారు. ఎమ్మెల్యే బొగుల దస్తగిరి సంబంధిత అధికారులతో మాట్లాడి తక్షణమే మరమ్మతులు పూర్తిచేసి ప్రజలకు రాకపోకలు సౌకర్యంగా ఉండేటట్లు చూడాలన్నారు. కర్నూలు మండల తెలుగుదేశం పార్టీ మాజీ మండల అధ్యక్షులు బుర్ర వెంకటేష్ నాయుడు, కొంతలపాడు బీసన్న, మాజీ ఎంపిటిసి శివన్న, హనుమంతు, చిన్నయ్య, తిమ్మప్ప, రాఘవేంద్ర, గంజిల్లా సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ప్రజాశక్తి - ఆదోని

గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలో నిమజ్జనానికి వెళ్లే ప్రధాన దారి ఆర్ట్స్ కాలేజ్, తిక్కస్వామి దర్గా, ఎమ్మిగనూరు సర్కిల్, భీమా సర్కిల్, ఫరీస్నా మోహల్లా, శ్రీనివాస్ భవన్, ఎల్‌బి స్ట్రీట్, న్యూ ఫ్లైవర్, వినాయక ఘాట్ ప్రధాన దారులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిమజ్జనానికి ఎలాంటి ఆటంకమూ లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. గణేష్ విగ్రహాల ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విగ్రహాలు వెళ్లే దారిలో ప్యాచ్ వర్క్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆర్అండ్‌బి అధికారులను ఆదేశించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో విద్యుత్ తీగలు, కేబుల్ వైర్లు అడ్డం లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డీఎస్పీ సోమన్న, తహశీల్దార్ శివ రాముడు, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ అనుపమ, సిఐ సూర్య మోహన్ రావు పాల్గొన్నారు.



డీఎస్పీకి సూచనలు చేస్తున్న సబ్ కలెక్టర్

మాజీ జడ్‌పిటిసి మంగమ్మపై కత్తితో దాడి

ప్రజాశక్తి - కోసిగి

తనపై కురువ మల్లయ్య అనే వ్యక్తి కత్తితో దాడి చేసి చంపేందుకు ప్రయత్నించారని వైసిపి నాయకులు, కోసిగి మాజీ జడ్‌పిటిసి మంగమ్మ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి... మంగమ్మ, వైసిపికి చెందిన కురువ మల్లయ్యతో సహజీవనం చేసే వారు. సాయిబాబా గుడి సమీపంలో ఉన్న మంగమ్మ ఇంట్లో మంగళవారం కురువ మల్లయ్యకు, మంగమ్మకు వాగ్వాదం చోటు చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. కురువ మల్లయ్య మంగమ్మ కడుపుపై కత్తితో దాడి చేసినట్లు చెప్పారు. మంగమ్మ పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదోని ఏరియా ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్ర మోహన్, పోలీసులతో సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.



మంగమ్మను పరామర్శిస్తున్న మురళీ మోహన్ రెడ్డి

మంగమ్మకు మురళీ మోహన్ రెడ్డి పరామర్శ : ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి ఆదేశాల మేరకు వైసిపి మండల ఇన్‌ఛార్జీ పి.మురళీ మోహన్ రెడ్డి, కోసిగి వైసిపి నాయకులు మాజీ జడ్‌పిటిసి మంగమ్మను పరామర్శించారు. డాక్టర్లు మనోజ్ కుమార్, అనిల్ కుమార్‌తో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మంగమ్మ కుటుంబ సభ్యులు నర్సమ్మ, అజయ్‌కు మురళీ రెడ్డి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే బాలనాగి రెడ్డి కుటుంబం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. జగదీష్ స్వామి, అంజి ఉన్నారు.

అల్లర్లు సృష్టిస్తే చర్యలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆదోని

వినాయక నిమజ్జనం సందర్భంగా అల్లర్లు సృష్టిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి హెచ్చరించారు. మంగళవారం వివిఎస్‌పి ఫంక్షన్ హాలులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మతసామరస్యానికి మారుపేరుగా ఆదోని ఉందని తెలిపారు. హిందూ, ముస్లింలు కలిసిమెలిసి వేడుకలు నిర్వహించుకోవడం తాను గమనించానని చెప్పారు. వినాయక నిమజ్జనం వేడుకలను ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు అందరూ సహకరించాలని కోరారు. విగ్రహాలు ఒకేసారి రావడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. పోలీసుల నిర్ణయం మేరకు రూట్ మ్యాప్ ఉంటుందని, పుకార్లు నమ్మవద్దని కోరారు. చిన్న పిల్లలను ట్రాక్టర్లపై ఎక్కించవద్దని, నిమజ్జనం జరిగే చోట ప్రమాదాలకు ఆస్కారం ఇవ్వవద్దని తెలిపారు. రాజకీయ లబ్ధి కోసం మాజీ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి విగ్రహాల రూటు మార్పు చేశారని, ఇది ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. నాయకులు విట్టా రమేష్, చెన్నబసప్ప, నాగరాజు, ఉపేంద్ర, సాయి, మహదేవ్, ఉషరాజు, మనీ ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

శ్రీమఠం పీఠాధిపతులకు తులాభారం

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీరాఘవేంద్రస్వామి మఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు వ్యాపారులు, వినాయక మిత్ర మండలి ఆధ్వర్యంలో తులాభారం నిర్వహించారు. మంగళవారం స్థానిక ఎంటిఆర్ వరుసలో ఉన్న శ్రీమధ్వ మార్గ కారిడారు షాపింగ్ కాంప్లెక్స్‌లోని దుకాణాల నిర్వాహకులు వినాయక మండపం ముందు తులాభారం ఏర్పాటు చేశారు. పీఠాధిపతులతో సమాన తూకంతో బెల్లం, కలకండ, గోడంబి, బాదం వంటి వాటితో త్రాసులో తూచి శ్రీమఠానికి అందజేశారు. అంతకుముందు వినాయక మండపం వద్దకు చేరుకున్న పీఠాధిపతులకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయనకు శాలువా, పూలమాలలు వేసి సన్మానించారు.

పాలకులు, అధికారుల మొద్దు నిద్ర : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని జాతీయ రహదారి, కర్నూలుకు వెళ్లే రహదారి ప్రమాదాలకు నిలయంగా మారినా పాలకులు, అధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ మండిపడ్డారు. ప్రమాదకరంగా ఉన్న ఆలూరు, పెద్దహోతూరు రహదారిలో సిపిఎం మండల కార్యదర్శి షాకీర్ అధ్యక్షతన మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏళ్లు గడుస్తున్నా ఆలూరు జాతీయ రహదారి పూర్తి చేయకపోవడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఆలూరు, కర్నూలు రహదారి పెద్ద గుంతలతో దర్శనమిస్తున్నా సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు చూసీచూడనట్లు వ్యవహరించడం సబబు కాదన్నారు. ప్రజాగ్రహానికి గురికాకముందే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని కోరారు. లేకపోతే సిపిఎం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కెపి.నారాయణస్వామి, పి.హనుమంతు, వెంకటేశ్వర్లు, కృష్ణ, ఈరన్న, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు

వరద బాధితులకు కొంకా బ్రదర్స్ చేయూత

ప్రజాశక్తి - ఆదోని

విజయవాడలో వరద బాధితులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అండగా నిలిచారని, ఆయనకు తమవంతు సహకారం అందిస్తున్నామని టిడిపి సీనియర్ నాయకుడు కొంకా ఉమాపతి నాయుడు తెలిపారు. మంగళవారం నిత్యావసర సరుకుల లారీని జెండా ఊపి విజయవాడకు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు ఆదేశాల మేరకు ఆదోని నుంచి వెయ్యి నిత్యావసర కిట్లు సమకూర్చామని తెలిపారు. అక్కడ సబ్ కలెక్టర్ ఓబులేసు ఆధ్వర్యంలో స్థానిక నాయకుల సహకారంతో విజయవాడలోని సింగనగర్, అయ్యప్ప స్వామి గుడి, భవానిపురం, ప్రసాదపాడు, రాజీవ్ నగర్ ప్రాంతాల్లో బాధితులకు పంపిణీ చేస్తామన్నారు. టిడిపి నాయకులు బత్తిని కుబేర్‌నాథ్, సిద్ధార్థ నాయుడు, బాబు నాయుడు, శ్రీనివాస్ ఆచారి తదితరుల సహకారంతో కిట్లను సమకూర్చినట్లు తెలిపారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి బత్తిని కుబేర్‌నాథ్, బీసీ సెల్ ప్రచార కార్యదర్శి తిమ్మప్ప, జిల్లా కార్యదర్శి బుద్ధారెడ్డి, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాన్వి దేవేంద్రప్ప, నాయకులు వెంకటేష్ వాల్మీకి, మాబాష, జయరాం, మల్లికార్జున, గోపాల్, సుబ్బు, వీరేష్, కల్లుపోతుల రంగన్న, మాజీ ఎంపిటిసి రంగన్న, రంగస్వామి నాయుడు, బాలాజీ, వలమన్న, మదిరే వీరేష్, కృష్ణారెడ్డి, చాంద్‌బాష ఉన్నారు.



జెండా ఊపి లారీని ప్రారంభిస్తున్న ఉమాపతి నాయుడు



సరుకుల వివరాలు వివరిస్తున్న ఉమాపతి నాయుడు

తెర్నేకల్‌లో డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి -దేవనకొండ

మండలంలోని తెర్నేకల్ గ్రామ ఎరుకల వీధిలో నివసిస్తున్న బోయ రామాంజనేయులు కుమార్తె బోయ చిన్నారికి డెంగీ వచ్చినట్లు జిల్లా అసిస్టెంట్ మలేరియా నివారణాధికారి చంద్రశేఖర్, మలేరియా సబ్ యూనిట్ అధికారి సాయిబాబా తెలిపారు. మంగళవారం తెర్నేకల్ గ్రామాన్ని సందర్శించి అపరిశుభ్ర ప్రాంతాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బోయ చిన్నారికి గత 3 రోజులుగా విపరీతమైన జ్వరం వస్తూ.. తగ్గకపోవడంతో ఆదివారం కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చేర్పించినట్లు తెలిపారు. రక్త పరీక్షలు చేయించగా డెంగీగా నిర్ధారణ అయిందని చెప్పారు. అధికారి రంగస్వామి, సర్పంచి మొగతాల్ అరుణ్ కుమార్‌తో కలిసి బాధిత చిన్నారి ఇంటి పరిసరాలను పరిశీలించి, స్థానిక వైద్య, ఆరోగ్య సిబ్బందితో ఇంటింటికీ తిరిగి ఫీవర్ సర్వే, లార్వా, దోమలు పెరిగే ప్రదేశాలను గుర్తించినట్లు తెలిపారు. నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేయించి, ఇళ్లలో అబేట్ ద్రావణం స్ప్రే చేయించి, కాలువలో మలాథీయాన్, బ్లీచింగ్ పౌడర్ చల్లించినట్లు చెప్పారు. ఎంఎల్‌హెచ్‌పి హర్షవర్ధన్, ఆరోగ్య కార్యకర్తలు సురేఖ, నాగలక్ష్మి పాల్గొన్నారు.



అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను పరిశీలిస్తున్న అధికారులు



విరాళం సేకరిస్తున్న నాయకులు

వరద బాధితులకు అండగా నిలుద్దాం

- తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు

ప్రజాశక్తి కౌతాళం

వరద బాధితులకు అండగా నిలుద్దామని తెలుగు రైతు జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, చౌదరి బసవరాజు కోరారు. మంగళవారం కౌతాళంలో విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే నష్టాల నుంచి ప్రజలను కాపాడడానికి మానవత దృక్పథంతో సహకరించాలని కోరారు. బాధితుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో ప్రజా సంఘాలు, పార్టీ నాయకులు బాధితుల కోసం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రజలు కూడా విరాళాలు అందించి పాలు పంచుకోవాలని కోరారు. డాక్టర్ రాజానందు, ముకయ్య, గొట్టయ్య, రామాంజి, నరసప్ప పాల్గొన్నారు.

ప్రియదర్శిని బ్యాంకు ఆధ్వర్యంలో విరాళం

ప్రజాశక్తి - ఆదోని



విరాళం అందిస్తున్న ఆదినారాయణ

విజయవాడ వరద బాధితుల కోసం సిఎం రిలీఫ్ ఫండ్‌కు రూ.లక్ష చెక్కును విరాళంగా ఇచ్చినట్లు ఆదోని ప్రియదర్శిని కోఆపరేటివ్ బ్యాంకు ఛైర్మన్ బి.చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. మంగళవారం బ్యాంకులో ఎమ్మెల్యే పార్థసారథికి చెక్కును అందజేశారు. ప్రియదర్శిని కోఆపరేటివ్ బ్యాంకు ఉద్యోగులు రూ.10,550, ప్రియదర్శిని కోపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ దశరథ్ రెడ్డి రూ.5 వేలు విరాళంగా ప్రకటించారు. బ్యాంకు డైరెక్టర్లు నారాయణరావు, మింటు అగర్వాల్, షా, నాయకులు విట్టా రమేష్, చెన్న బసప్ప, బ్యాంకు మేనేజర్ రమేష్ ఉన్నారు.

వరద బాధితులకు టిడిపి విరాళం

ప్రజాశక్తి - గోనెగండ్ల

ఇటీవల కురిసిన వర్షాలకు సర్వం కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్న విజయవాడ వరద బాధితులకు టిడిపి నాయకులు మండలంలో విరాళాల సేకరణ చేపట్టారు. మంగళవారం వారు మాట్లాడారు. విజయవాడలో అజిత్ సింగ్ నగర్, సుందరయ్య కాలనీ, తోటవారి వీధి, రోటరీ నగర్, సితార నగర్, నందమూరి నగర్ ప్రాంతాలు ముంపునకు గురయ్యాయని, అక్కడి ప్రజలు సర్వం కోల్పోయి ఇబ్బందుల్లో ఉన్నారని తెలిపారు. వారిని ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఇటీవల రూ.5 లక్షలు అందజేశారని చెప్పారు. ఆయన స్ఫూర్తితో తాము కూడా గోనెగండ్ల మండలంలో సేకరించిన విరాళాల మొత్తం రూ.1.67 లక్షలను ముఖ్యమంత్రి సహాయ నిధికి జమ చేశామని తెలిపారు. టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, నాయకులు తిరుపతయ్య నాయుడు, కులుమాల రాముడు, శేషప్ప నాయుడు, రమణ, శిల్పి శ్రీను, రామకృష్ణ, హాజీ పాల్గొన్నారు.



విరాళాలు సేకరిస్తున్న టిడిపి నాయకులు

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం మండలంలోని చిన్నహరివాణం ఎల్‌ఎల్‌సి కాలువ వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జనం ప్రాంతాన్ని తహశీల్దార్ శివరాముడు, ఎంపిడిఒ గీతావాణి, ఇఒఆర్‌డి నాగరాజ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. నిమజ్జన ప్రాంతాల్లో వృద్ధులు, పిల్లలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని తెలిపారు. నిమజ్జనానికి ఎలాంటి ఆటంకమూ లేకుండా విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. బారికేడ్లు ఏర్పాటు చేయడంతో పాటు గజ ఈతగాళ్లను అందుబాటులో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రహదారి గుండా వెళ్లే వాహనాలకు ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు చంద్రశేఖర్, సురేష్ పాల్గొన్నారు.

విశాఖ స్టీల్ పరిరక్షణకు ఉద్యమాలే శరణ్యం

- సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విశాఖ స్టీల్ పరిరక్షణకు ఉద్యమాలే శరణ్యమని సిఐటియు తాలూకా అధ్యక్ష, కార్యదర్శులు గోవిందు, రాముడు, ఎఐటియుసి తాలూకా అధ్యక్షులు తిమ్మ గురుడు, ఐఎఫ్‌టియు తాలూకా నాయకులు ప్రసాద్, రైతుసంఘం నాయకులు అబ్దుల్లా తెలిపారు. మంగళవారం సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు, రైతుసంఘం ఆధ్వర్యంలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రయివేటీకరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుట్ర పన్నుతున్నాయని విమర్శించారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విశాఖ స్టీల్ ప్లాంట్ ఉత్పత్తిని తగ్గించి నిర్వీర్యం చేయడానికి కుట్ర పన్నుతున్నారని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌లోని రెండు విభాగాలు మూతపడ్డాయని, ఈ మధ్య కేంద్ర మంత్రులు స్టీల్ ప్లాంట్ సందర్శించి ప్రధానమంత్రితో చర్చించి ఉత్పత్తిని పెంచడానికి, పరిరక్షణకు కృషి చేస్తామని హామీఇచ్చారని గుర్తు చేశారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమించాలని కోరారు. కార్మిక, రైతు సంఘం నాయకులు లక్ష్మీ నరసయ్య, వీరేష్, ఏసోబు, రమేష్, సుభాన్, సుంకన్న, రాజు, రంగస్వామి, నరసింహులు, తిమ్మప్ప పాల్గొన్నారు. **ఆలూరు** అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కెపి.నారాయణస్వామి, కృష్ణ, మైనా, ఎఐటియుసి నాయకులు రామాంజినేయులు, గోపాల్ పాల్గొన్నారు.



ఎమ్మిగనూరులో ఆందోళన చేస్తున్న నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలి

- బంటనహాల్ గ్రామస్తులు

ప్రజాశక్తి - చిప్పగిరి

బంటనహాల్ రైల్వే స్టేషన్ దగ్గర ఫ్లై ఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని బంటనహాల్ గ్రామానికి చెందిన మల్లికార్జున, సురేష్, గ్రామస్తులు కోరారు. మంగళవారం రైల్వే స్టేషన్ మాస్టర్ వెంకటేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. బంటనహాల్ రైల్వేస్టేషన్ దగ్గర నాలుగు రైల్వే లైన్లు దాటి స్టేషన్‌లోకి వెళ్లాలంటే గర్భిణులు, బాలింతలు, వృద్ధులు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. గుమ్మనూరు, కొట్టాల, కాజీపురం, బంటనహాల్, ఏరూరు, దేగులపాడు గ్రామాలకు చెందిన ప్రజలు ఎన్నో సంవత్సరాల నుంచి ఈ సమస్య ఎదుర్కొంటున్నారన్నారు. త్వరలో కొత్త లైన్లు కూడా వస్తున్నాయని, సంబంధించిన రైల్వే ఉన్నతాధికారులు ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

15లోపు ఈకేవైసీ పూర్తి చేయాలి

- ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని రైతులందరూ ఈనెల 15లోపు ఈ కేవైసీని పూర్తి చేసుకోవాలని ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ హేమలత తెలిపారు. మంగళవారం మండలంలోని హెచ్.కైరవాడి గ్రామంలో పంట నమోదును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 50 శాతం మాత్రమే ఈకేవైసీ నమోదు ప్రక్రియ పూర్తయిందని తెలిపారు. ఈనెల 15లోపు సమీప రైతు సేవా కేంద్రాలను సంప్రదించి పూర్తి చేసుకోవాలన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- ఎకరాకు రూ.40 వేలు పరిహారమివ్వాలి
- రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు రామచంద్రయ్య

ప్రజాశక్తి - ఆస్పరి

ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య డిమాండ్ చేశారు. మంగళవారం కర్నూలు రోడ్డులోని పెట్రోలు బంకు సమీపంలో దెబ్బతిన్న టమోటా, పత్తి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రామచంద్రయ్య, సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య మాట్లాడారు. ఈఏడాది అకాల వర్షంతో రైతులు సాగు చేసిన పత్తి, వేరుశనగ, కంది, ఉల్లి, ఆముదం, మిరప, సజ్జ పంటలన్నీ నీట మునిగి తీవ్రంగా దెబ్బతిన్నాయని తెలిపారు. వ్యవసాయం కోసం రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందే పరిస్థితులు లేవన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకూ ఎకరాకు రూ.40 వేలు పరిహారం అందించాలని కోరారు. బ్యాంకుల్లో రైతులు తీసుకున్న పంట రుణాలను రద్దు చేయాలని, పంటల బీమాను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి జగన్నాథం, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పంపన్న గౌడ్, నాగేంద్రయ్య, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతుసంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు బడేసాబ్, రంగన్న, సిపిఐ నాయకులు కృష్ణమూర్తి, రైతుసంఘం సీనియర్ నాయకులు ఉరుకుంద పాల్గొన్నారు. **దేవనకొండ** మండలంలోని అలారుదిన్నె హంద్రీ పరివాహక నీట మునిగిన పంట పొలాలను, అధిక వర్షాలతో నష్టపోయిన రైతుల పంట పొలాలను ఎపి రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వర్లు అధ్యక్షతన పరిశీలించారు. రైతు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కె.జగన్నాథం, సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, రైతుసంఘం జిల్లా కార్యదర్శి పంపన్న, కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, రైతుసంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగేంద్రయ్య, మండలం గౌరవాధ్యక్షులు వై.కొండప్ప, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కృష్ణ, మండల నాయకులు భక్త తుకారం, రామాంజనేయులు, నాగరాజు, వీరాంజనేయులు, శ్రీనివాసులు, భాస్కర్ పాల్గొన్నారు.



ఆస్పరిలో పత్తి పంట పరిశీలిస్తున్న నాయకులు



పాఠశాలను సందర్శిస్తున్న మాధవరావు దేశాయ్

నాణ్యమైన భోజనమందించాలి

- కస్తూరిబా గాంధీ పాఠశాలను సందర్శించిన మాధవరావు దేశాయ్

ప్రజాశక్తి - నందవరం

విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు మాధవరావు దేశాయ్ వంట సిబ్బందికి సూచించారు. మంగళవారం కస్తూరిబా గాంధీ పాఠశాలను ఆయన సందర్శించారు. పాఠశాలలో సమస్యల గురించి ప్రిన్సిపల్ శైలజను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థినుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. భోజనం, తాగునీరు సమస్యలేమీ లేవని విద్యార్థినులు తెలిపారు. భోజనం, నీటి సమస్యలుంటే భయపడకుండా చెప్పాలని, ఎమ్మెల్యే బీవీ.జయనాగేశ్వర దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని మాధవరావు దేశాయ్ తెలిపారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించారు. పాఠశాల ఆవరణలో పెరిగిన మొక్కలను తొలగించి శుభ్రంగా ఉండేలా చూస్తామన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ భీమన్న, చాకలి మల్లికార్జున పాల్గొన్నారు.

13 నుంచి క్రీడా పోటీలు

ప్రజాశక్తి - ఆస్పరి

ఈనెల 13 నుంచి ఎపి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎంఇఒలు రాజేంద్ర ప్రసాద్, తిరుమల రావు తెలిపారు. మంగళవారం ఎంపిడిఒ కార్యాలయంలో క్రీడా పోటీల ఆహ్వాన పత్రికను మండల కోఆర్డినేటర్ విజయ్ ఆనంద్ రావు ఎంఇఒలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని యాజమాన్యాల పాఠశాలల విద్యార్థులకు ఎపి మోడల్ స్కూల్ క్రీడా ఆవరణలో మండలస్థాయి క్రీడా పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు వాలీ బాల్, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారుల కు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయ కుమారి, విజయ్ ఆనంద్ రావు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే 'కొడాలి'పై ఫిర్యాదు

ప్రజాశక్తి - ఆలూరు

అసభ్య పదజాలంతో దూషించిన మాజీ ఎమ్మెల్యే కొడాలి నానిపై కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని టిడిపి లీగల్ సెల్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్ కుమార్, టిడిపి నాయకులు వెంకటేష్ చౌదరి, షేక్షావలీ, విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం ఆలూరు సిఐ శ్రీనివాస్ నాయక్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్ కుమార్ మాట్లాడారు. వరదలతో అతలాకుతలమై ఇబ్బందుల్లో ఉన్న ప్రజలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ధైర్యం చెబుతూ, అప్రమత్తం చేస్తున్నారని తెలిపారు. అధికారులతో మమేకమై రాత్రి, పగలు కష్టపడుతూ వారి బాగోగులు చూస్తున్న ముఖ్యమంత్రిపై 'లోఫర్' అంటూ అసభ్య పదజాలంతో దూషించిన కొడాలి నాని అలియాస్ కొడాలి వెంకటేశ్వర రావుపై చర్యలు తీసుకోవాలని కోరారు. కొడాలి నాని దూషించిన మాటలను మెమో రికార్డును సిఐకి అందించినట్లు తెలిపారు.

సేంద్రీయ ఎరువులు లాభదాయకం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

సేంద్రీయ ఎరువుల వాడకం వల్ల పంట దిగుబడులు పెరిగి వ్యవసాయం లాభదాయకంగా ఉంటుందని వినూత్న ఆగ్రో టెక్ ఎల్‌ఎల్‌పి మార్కెట్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ కె.కిరణ్ కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని తిమ్మాపురం, నాగలాపురం గ్రామాల్లో రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. రైతులకు సేంద్రీయ ఎరువులు, జీవన ఎరువులు గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంట సాగులో రసాయనిక ఎరువులు అధికంగా వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవుతున్నాయని తెలిపారు. రసాయన ఎరువుల వాడకం వల్ల భూసారం తగ్గిపోయి, పంట దిగుబడులు తగ్గిపోతాయని చెప్పారు. కంపెనీ ప్రతినిధులు జిఎం.శ్రీనివాస్ రెడ్డి, ఎఎస్ఎం లింగన్న, ఫీల్డ్ స్టాఫ్ నాగేష్ పాల్గొన్నారు.

'ఎత్తిపోతల' మరమ్మతులు జరిగేనా..?

- మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్రప్రసాద్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు



ఎమ్మిగనూరు, మంత్రాలయం నియోజకవర్గాల్లోని శ్రీగురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకాల మరమ్మతులు జరిగి నీళ్లు పారేనా అని మాజీ కౌన్సిలర్ కోనేరు నాగేంద్ర ప్రసాద్ ప్రశ్నించారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ట్రాన్స్‌ఫార్మర్లను దొంగతనం చేసిన దొంగలు దొరికారని, రైతులు పంటలు వేసుకునే సమయంలో దొంగతనం జరగడంతో రెండు నియోజకవర్గాల రైతులు ఆందోళన చెందారని తెలిపారు. ఈ విషయంపై తాను ఎప్పటికప్పుడు దొంగలను పట్టుకొని తీరాలని కృషి చేశానని చెప్పారు. దీనిపై రైతులు, ప్రతిపక్షం, వామపక్షాలు స్పందించాయన్నారు. పోలీసులు కూడా ఈ దొంగతనాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకొని దొంగలను పట్టుకోవడం అభినందనీయమని తెలిపారు. రైతుల సమస్య వచ్చినప్పుడు సహేతుకంగా విమర్శించుకుంటూ రైతులకు న్యాయం చేయాలని చెప్పారు. ఈ విషయంలో తాను స్పందిస్తే ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర రెడ్డి అనుచరులు తనను హేళన చేశారని తెలిపారు. అది వారికి, వారి నాయకుడి సంస్కారానికి వదిలేస్తున్నానని చెప్పారు. ఎమ్మెల్యే ముఖ్యమంత్రిని కలిసి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు నివేదిక ఇచ్చినట్లు ప్రచారం చేసుకుంటున్నారని, ఇప్పటివరకు ఎలాంటి చర్యలూ లేకపోవడంతో ఎమ్మెల్యే సమాధానం చెప్పుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన మోటార్ల ట్రాన్స్‌ఫార్మర్ల దొంగతనం విషయం లోనూ, కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటులోనూ స్పందించడం లేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల కోసం రూ.3 కోట్లు మంజూరు చేసి రెండు నియోజకవర్గాల్లోని రైతులను ఆదుకోవాలని కోరారు.

13న దక్షిణామూర్తి స్వామి ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి - ఆస్పరి

మండలంలోని కారుమంచి గ్రామంలో వెలసిన శ్రీదక్షిణామూర్తి స్వామి 32వ ఆరాధనోత్సవాలు ఈనెల 13న నిర్వహిస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడారు. 12న ఉదయం గంగాధరయ్య స్వామి ఉపన్యాసం, 13న ఉదయం ప్రభాత సేవ, గంగ పూజ, సద్గురు సమాధికి పంచామృతాభిషేకం, గాయత్రి మాత మహా యజ్ఞం ఉంటుందని తెలిపారు. స్వామివారి ఆరాధనోత్సవం లో భాగంగా భజన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి మొదటి బహుమతి రూ.15,116, రెండో బహుమతి రూ.12,116, మూడో బహుమతి రూ.9,116, నాలుగో బహుమతి రూ.7,116, ఐదో బహుమతి రూ.6,116, ఆరో బహుమతి రూ.5,116 అందజేస్తున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేవారు 13న రాత్రి 8 గంటల్లోపు రూ.300 రుసుం చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని చెప్పారు. మరిన్ని వివరాలకు 9491343451, 8074939046 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.